క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గన్నవరం మండలం చిన్న అవుటపల్లికి చెందిన జాస్తి ఆంజనేయ ప్రసాద్ సోమవారం రూ. 1,11,116 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ కేఎల్ఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలి


గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం : ఈ నెల 21వ తేదీన విశాఖలో జరిగే అఖిల భారత ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలని ఏఐకేఎమ్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మల సురేష్ కోరారు. సోమవారం స్థానిక రామనర్సయ్య భవనంలో సదస్సుకు సంబంధించిన గోడ పత్రికలను ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల జీవన పరిరక్షణకై ఆదివాసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కారం రాఘవ, తగరం బాబూరావు, కె.ఏసు, తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్యకు నివాళి


సంజీవయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీ దామోదర సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంజీవయ్య 51వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలోని దామోదర సంజీవయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశంలోని తొలి దళిత ముఖ్యమంత్రిగా, నీతి, నిజాయితీలకు తలమానికంగా సంజీవయ్య చేసిన సేవలు ఎనలేనివన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నేటి యువతకు సంజీవయ్య ఆదర్శం అని, ఆయన మార్గంలో అందరూ నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చలమాల శ్రీనివాస్, వింజరపు సుబ్బారావు, అధ్యాపకేతర సిబ్బంది పి.సతీష్‌బాబు, ఎం.దుర్గారాణి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌కు కుర్చీల బహూకరణ


బార్ అసోసియేషన్‌కు కుర్చీలు అందజేస్తున్న వసుధ ఫౌండేషన్ సభ్యులు

జంగారెడ్డిగూడెం : హైదరాబాద్‌కు చెందిన వసుధ ఫౌండేషన్ జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్‌కు 20 కుర్చీలను బహూకరించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు విజ్ఞప్తికి స్పందించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు కుర్చీలను బార్ అసోసియేషన్‌కు అందించారు. సోమవారం బార్ అసోసియేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు బోడే ఫణి చంద్ర శేఖర్, కొండపల్లి పండు, కొండేపాటి రామకృష్ణ కుర్చీలను బార్ అసోసియేయిన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావుకు అందించారు.

ఎంఆర్‌పీఎస్ నూతన గ్రామ కమిటీల ఏర్పాటు

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో ఎంఆర్‌పీఎస్ నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి విసంపల్లి సిద్దూ మాదిగ తెలిపారు. సోమవారం అచ్చియ్యపాలెంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అర్హులైన దళితులకు ఇళ్లస్థలాలు మంజూరు చేసేవిధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. నాయకులు శేఖర్ మాదిగ, వడ్లపాటి రమేష్, పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కామవరపుకోట : పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎస్సై కె. వెంకన్న తెలిపారు. జీలకర్రగూడెంలో కొందరు పేకాటాడుతున్నరనే సమాచారంతో ఎస్సై వెంకన్న సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈదాడిలో ఆరుగురిని అదుపులో తీసుకుని వారి నుంచి రూ.4 వేలు నగదు స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై చెప్పారు.

ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం

బుట్టాయగూడెం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మండలంలోని కృష్ణాపురంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు వివరించారు. పలువురు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగిస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సీఎం జగన్‌మోమన్‌రెడ్డి పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతిరమణ, సర్పంచ్‌లు మడకం రామలక్ష్మి, తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీ చారపు సుజాత, మండల సచివాలయాల కన్వీనర్ తెల్లం సింహాచలం నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, అనుపోజు మురళి, ప్రకాష్, సీఐ బి. వెంకటేశ్వరరావు, ఎంఈఓ టి.బాబూరావు, సీడీపీఓ తులసి, నాయకులు దినేష్, తెల్లం దుర్గారావు, గాడి వెంకటరెడ్డి, తెల్లం దేవరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, తదితరులు పాల్గొన్నారు.


కృష్ణాపురంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు


కంతమనేనివారిగూడెంలో బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

నవరత్నాలతో ప్రతి ఇంటిలో ప్రగతి

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన నవరత్నాల పథకాలతో రాష్ట్రంలోని ప్రతి ఇల్లు ప్రగతి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజ అన్నారు. సోమవారం గుంటుపల్లి గ్రామపంచాయతీ కంతమనేనివారిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని మహిళలు ఎమ్మెల్యే ఎలీజాకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు, యువకులు పూలమాలలతో ఆయనను ఘనంగా సత్కరించారు. గ్రామంలోని సీఎస్ఐ సంఘ సభ్యులు ఆయనను ఆహ్వానించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేస్తే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను తీసుకొచ్చి నాలుగేళ్ల పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించి పేదల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభంజనమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోరిక దాసు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పందు జగదీష్, పార్టీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, కోమ్మిన నరేష్, మోరంపూడి సత్యనారాయణ, మెరుగు బాబురావు, నాగళ్ళ సీతారాంబాబు, రాయంకుల సత్యనారాయణ, షేక్ మేరా సాహెబ్, నల్లూరు ప్రభాకర్ రావు, తుమ్మల సీతారామయ్య, ఆశీర్వాదం, సేవ శ్రీను గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

వేలేరుపాడు : వేలేరుపాడు మండలంలోని శివకాశీపురం, భూదేవిపేట గ్రామాల్లో సారా విక్రయిస్తున్న బందం రాంమూర్తి, మల్లెల వెంకటేశ్వరావులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వీరి వద్ద నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం జంగారెడ్డిగూడెం కోర్టుకు తరలించినట్లు ఎస్సై శ్రీను తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

టి.నరసాపురం : ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నేరంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని రుద్రకోట రాజుగూడెంకు చెందిన బి.రామకృష్ణ ఎర్రకాలువలోని ఇసుకను అనుమతులు తీసుకోకుండా ట్రాక్టర్‌పై తరలిస్తున్నాడన్న సమాచారం మేరకు ఎస్ఈబీ సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో రామకృష్ణపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్, ట్రక్కును, ఒక యూనిట్ ఇసుకను సీజ్ చేసినట్లు చెప్పారు.

సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు

ద్వారకాతిరుమల: విశాల సహకార పరపతి సంఘాల(సొసైటీలు) ద్వారా తమ ప్రభుత్వంలో రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు సుమారు రూ. 2 కోట్లతో అభివృద్ధి చేసిన ద్వారకాతిరుమల సొసైటీ పెట్రోల్ బంకును గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, స్థానిక సొసైటీ ఛైర్‌పర్సన్ గుర్రాల లక్ష్మణ్, పర్సన్‌లు చుక్కా నరసింహరావు, కనికెల్లి వరలక్ష్మితో కలసి సోమవారం ప్రారంభించారు. ముందుగా ఆయన పురోహితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు తదితరులతో కలసి పెట్రోల్, డీజిల్ పంపులను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఆ తరువాత పలువురు వినియోగదారులకు ఎమ్మెల్యే స్వయంగా పెట్రోల్ కొట్టారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీనియర్ మేనేజర్ పారుపల్లి సత్యారావు, డివిజినల్ మేనేజర్ కె.వెంకటేష్ మూర్తి, సేల్స్ ఆఫీసర్ కోరుపొల్లు సంజీవి, సొసైటీ ఛైర్‌పర్సన్‌లు గోపా నాగేశ్వరరావు, ముల్లంగి వెంకట్రామిరెడ్డి, చెరుకూరి ప్రసాదరావు, అంబటి గాంధి, ఉక్కుర్తి వెంకట్రావు, యిమ్మడి నాగు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, చెలికాని బుల్లియ్య, సర్పంచ్‌లు దాకారపు బంగారమ్మ, కస్సే శ్రీహరిరావు, లక్కాబత్తుల సిద్ధిరాజు, బండారు ధనలక్ష్మి, పసుపులేటి ఏసుబాబు, కామిరెడ్డి శ్రీను, చవల రమేష్, ప్రత్తిపాటి యోహాను, బొండాడ వెంకన్నబాబు, ఎంపీటీసీలు మానుకొండ కన్నయ్య, పల్లపాటి ధర్మారావు, అల్లాడ హరేరామకృష్ణ, తదితరులున్నారు.


ద్వారకాతిరుమలలో సొసైటీ పెట్రోల్ బంక్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

పట్టాభిపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిపై చర్యలు తీసుకోవాలని యాదవ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షులు నెట్రు గణేష్ యాదవ్ మాట్లాడుతూ అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు భరోసా కల్పిస్తూ, వారి సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి కారుమూరి తెలిపారని, ఎవరికైనా ఇబ్బందులు ఉంటే తనకు ఫోన్ చేయాలని సూచించారన్నారు. దీనిపై టీడీపీకి చెందిన కొందరు ఆరోపణలు గుప్పిస్తున్నారని, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభి ఒక మెట్టు ఎక్కి మంత్రి కారుమూరిని అసభ్య పదజాలంతో దూషించారన్నారు. మంత్రిని అవమాన పరిచిన పట్టాభిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పట్టాభి మంత్రి కారుమూరికి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో తాము రాష్ట్రవ్యాప్తంగా ధర్నా, రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షుడు మిండా నాగేశ్వరరావు, జంగారెడ్డిగూడెం పట్టణాధ్యక్షుడు నీలపాల అనిల్ యాదవ్, టౌన్ ఉపాధ్యక్షుడు చిన్ని వీరబాబు, మండల అధ్యక్షుడు వీర్ల విజయ్, మండల యూత్ అధ్యక్షుడు ఎస్.రాజేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు వెలగల తేజ యాదవ్, జంగారెడ్డిగూడెం యాదవ సోదరులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

త్వరితగతిన రోడ్డు నిర్మాణాలను పూర్తిచేస్తాం

బుట్టాయగూడెం : పోలవరం నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్అండ్‌బీ ఎస్ఈ జీవీ భాస్కరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ఆర్అండ్‌బీ అధికారుల బృందం కృష్ణాపురంలో కలిశారు. ఈ సందర్భంగా రోడ్డు పనులపై ఎమ్మెల్యేతో చర్చించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొయ్యలగూడెం మండలంలోని నర్సాపురం రోడ్డు పనులు పూర్తయ్యాయని చెప్పారు. టి. నర్సాపురం మండలంలో చింతలపూడి-కామవరపుకోట నుంచి మక్కినవారిగూడెం రోడ్డు పనులు పూర్తయ్యాయన్నారు. చింతలపూడి రావికంపాడు రోడ్డు పనులు కూడా పూర్తి చేశామన్నారు. అయితే జీలుగుమిల్లి మండలం పరిధిలో బర్రింకలపాడు, పూచికపాడు, బుట్టాయగూడెం-జీలుగుమిల్లి మండలాల పరిధిలో బుట్టాయగూడెం, దొరమామిడి, పూచికపాడు రోడ్డు, పోలవరం మండలానికి సంబంధించి రేపల్లెవాడ, పోలవరం తాలూకా ఆఫీస్‌రోడ్డు, కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం, రేగులకుంట, కుక్కునూరు మండలం బూరుగుంపాడు, అశ్వారావుపేట, వేలేరుపాడు మండలం వినాయకపురం నుంచి ఆర్‌గూడెం రోడ్డు పనులకు సంబంధించి టెక్నికల్ ఇబ్బందుల కారణంగా పనులు ఆగాయని చెప్పారు. అవి మంజూరైన వెంటనే పనులను పూర్తి చేస్తామన్నారు. ఈఈ వై.కిషోర్ బాపూజీ, డీఈఈ సీహెచ్ హరికృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ మడకం రామలక్ష్మి, ఎంపీటీసీ చారపు సుజాత, తదితరులు పాల్గొన్నారు.


ఆర్అండ్‌బీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

వడివడిగా ధాన్యం సేకరణ

కొయ్యలగూడెం : ధాన్యం సేకరణ వేగవంతం చేశామని రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పండిన పంటను విక్రయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఏవో చెన్నకేశవులు సోమవారం పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొయ్యలగూడెం, పొంగుటూరు, రాజవరం పంచాయతీల పరిధిలో నెలకొల్పామని, ఇప్పటివరకు 27 టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుత రబీ సీజన్‌కి ఎనిమిది వందల హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు వరిని పండించగా ఇప్పటివరకు కురిసిన వర్షాల వల్ల ఎక్కడా నష్టం వాటిల్ల లేదన్నారు. అదేవిధంగా మొక్కజొన్నకు కూడా నష్టం కలగలేదని తెలిపారు. ధాన్యం సేకరణ వేగవంతం చేసే విధంగా వ్యవసాయ విభాగం కృషి చేస్తోందన్నారు.


పొంగుటూరు రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం ఎగుమతి చేస్తున్న దృశ్యం

ప్రచారాల కోసం పాకులాడకండి

ప్రచారాల కోసం పాకులాడవద్దని, రైతన్నలను అందుకు పావులుగా చేసుకోవద్దని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల ఏర్పడిన తుపాను ప్రభావం వల్ల వరికి గాని మొక్కజొన్నకు గాని నష్టం వాటిల్ల లేదని ప్రభుత్వ అధికారుల విచారణలో తేలిందని, అదే మాట రైతన్నలు కూడా అధికారుల వద్ద పేర్కొన్నారని అన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీల నాయకులు వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లి రైతులతో గిట్టుబాటు ధర వస్తుందా అని మాట్లాడుతూ పచ్చ మీడియా ద్వారా పండిన పంట వర్షానికి నష్టపోయిందంటూ ప్రచారం చేస్తున్నారని ఇది ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు.

గిట్టుబాటు ధరకే ధాన్యం కొనుగోలు

పోలవరం రూరల్ : రైతులు పండించిన పంటను ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందని తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. పోలవరం మండలంలో రైతులు పండించిన ధాన్యం పంటను మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబుతో కలిసి ఆమె పరిశీలించారు. రైతుల నుంచి పంట వివరాలను తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు కోరిన మేరకు రూ. 20వేల విలువైన గోనె సంచులను రెండు రోజుల్లో రైతులకు అందజేస్తామన్నారు. రైస్‌మిల్లర్లతో సంప్రదించినట్లు తెలిపారు.

రామాలయం నిర్మాణానికి రూ.లక్ష విరాళం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెంలో కోదండ చంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సోమవారం రూ. 1,10,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో చేస్తున్న ఈ ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారాన్ని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వనమా రాంబాబు, పోలవరం బీజేపీ కన్వీనర్ చాట్రాతి ప్రసాద్, నాయకులు మొడియం శ్రీనివాస్, వీహెచ్‌పి కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్, మామిళ్ల అప్పారావు, నెర్సు సుబ్బారావు, కోరకుల శ్రీను, మేకల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చౌదరి

ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి

కుక్కునూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం కుదించడానికి చేస్తున్న ప్రయత్నాల్ని విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కుక్కునూరులో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ కూరాకుల బాబురావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ నాయకత్వం ఉపాధి హామీ పథకానికి ప్రతి సంవత్సరం నిధులు తగ్గిస్తూ పథకాన్ని నీరుకార్చుతోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా 11 మంది సభ్యులతో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కుక్కునూరు మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా అగ్నిపర్తి వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా బుయ్యన రామలక్ష్మి, కార్యదర్శిగా కూరాకుల బాబురావు, సహాయ కార్యదర్శిగా మాచర్ల పద్మ, కోశాధికారిగా దాసరి సర్వేశ్వరరావు ఎన్నికయ్యారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత


జాతరలో కుటుంబ సభ్యులతో పాల్గొన్న బాలరాజు

బుట్టాయగూడెం : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. దొరమామిడిలో జరగుతున్న ముత్యాలమ్మ, మాయాలమ్మ, గంగాలమ్మ, పుంతలో ముసలమ్మ, పోతురాజు జాతర మహోత్సవాల్లో ఆయన సోమవారం పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. జాతర మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఎమ్మెల్యే బాలరాజు ఉందని తెలిపారు.

12 నుంచి 18 వరకు పారిజాతగిరి బ్రహ్మోత్సవాలు


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, ఈవో మానికల రాంబాబు తెలిపారు. 12న బ్రహ్మోత్సవాల అంకురార్పణ, 13న ధ్వజారోహణం, శేషవాహన సేవ, 14న హనుమంతవాహన సేవ, 15న స్వామి వారి కళ్యాణోత్సవం, 16న గరుడోత్సవం (గ్రామోత్సవం), 17న చక్రస్నానం, గజవాహన సేవ అనంతరం ధ్వజావరోహణము జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాల బ్రోచర్, గోడ పత్రికను సోమవారం ఎమ్మెల్యే ఎలీజా పారిజాతగిరిలోని కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, పార్టీ పట్టణాధ్యక్షులు చంద్రరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి


మోటారు బోర్ల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

కొయ్యలగూడెం : గవరవరంలో తాగునీటి సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. వరవరం పంచాయతీకి పాలకవర్గం లేకపోవడంతో అధికారులపైనే మౌలిక వసతుల కల్పనకు ప్రజలు ఆధారపడి ఉన్నారు. అయితే దాదాపు ఆరు నెలల నుంచి తాగు నీరు అడపాదడపా వస్తున్నా 20 రోజుల నుంచి పూర్తిగా నిలిచిపోయిందని, దీంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయించి తాగు నీరు తెచ్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పరిష్కారం కాలేదని, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు. కనీసం వాటర్ ట్యాంకర్ ద్వారానైనా తాగునీటి సరఫరా చేయాలని మాజీ సర్పంచ్ మద్దిపాటి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

చింతలపూడి : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. సోమవారం శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ శాఖ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మిరియాల దిలీప్ మాట్లాడారు. తెలుగులో చదవడం, రాయడం, మ్యూజిక్, పేపర్ ఆర్ట్ థియేటర్ ఆర్ట్ వంటి వాటిపై శిబిరంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. జూన్ 11 వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణా శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ తుల్లాబత్తుల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఇమ్రాన్, రెహ్మాన్, వెంకటేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఎం.వర్మ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. శాఖా గ్రంథాలయ అధికారి పి.దుర్గారావు మాట్లాడుతూ సోమవారం 30 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎండీ ఉమర్‌అలీ, భక్తసింగ్, శిరీషా తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడిలో మాట్లాడుతున్న గ్రంథాలయ శాఖ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మిరియాల దిలీప్

జంగారెడ్డిగూడెం రూరల్ : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సర్పంచ్ గెల్లా వెంకట రమణ అన్నారు. మండలంలోని లక్కవరం శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని సర్పంచ్ వెంకట రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా విద్య విధానానికి పెద్ద పీఠ వేసిందన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, గ్రంథాలయాధికారి ఎం.రియాజ్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ప్రారంభించారు. లైబ్రేరియన్ యు.రాముడు జూన్ నెల 2వ తేదీ వరకు ఈ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఒక్కో క్రీడాంశానికి సంబంధించి నిష్ణాతులచే విద్యార్థులకు శిక్షణ ఇస్తామని రాముడు తెలిపారు. కథలు రాయడంతో పాటు రచనలపై ఆసక్తి కల్పించడం విద్యార్థులకు నేర్పిస్తామన్నారు. ముప్పిడి చినబాబు, శివ మాష్టారు, చదరంగ రాష్ట్ర క్రీడాకారుడు ఎస్‌బీజీ శేఖర్ మాట్లాడుతూ పిల్లలు గ్రంథాలయంలో జరిగే వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత సోమవారం ప్రారంభించారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులకు పుస్తక పఠనం, సమీక్షా కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ అధికారి గుర్రం నాగరాజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప, గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి తదితరులున్నారు.